క్లుప్తంగా

పనితీరుతోనే గుర్తింపు



ప్రశంసాపత్రం అందుకుంటున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురామ్

శ్రీకాకుళం క్రైమ్ : విధి నిర్వహణలో పనితీరే పోలీసులకు మంచి గుర్తింపునిస్తుందని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం నేరసమీక్షా సమావేశం ముగిసిన అనంతరం వివిధ కేసుల్లో ప్రతిభ కనబర్చినవారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా కేసులను వాదించిన ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రఘురామ్, వ్యక్తిగత పాస్‌పోర్టులను విచారణ చేసే స్పెషల్‌బ్రాంచి సీఐ ఇమ్మాన్యుయల్ రాజుతో పాటు టెక్కలి సీఐ విజయ్‌కుమార్, జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం, నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాస్, పలువురు ఎస్‌ఐలకు ఈ ప్రశంసాపత్రాలు దక్కాయి.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



శిక్షణ ఇస్తున్న అధికారులు

రణస్థలం: ప్రకృతి వ్యవసాయంలో సక్రమమైన పద్ధతులు అవలంబించడం ద్వారా పంటల్లో అధిక దిగుబడులు సాధించవచ్చునని రైతులకు తెలియజేయాలని ప్రకృతి మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ అన్నారు. లావేరు, రణస్థలం మండలంలోని వీఏఏలు, వీహెచ్ఏలకు ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణ శనివారం కూడా కొనసాగింది. దీనిలో భాగంగా రణస్థలం మండలం ముక్తుంపురంలో నవధాన్యాలు సాగు చేసిన పొలంలో పంట కోత ప్రయోగంపై అవగాహన కల్పించారు. ఎకరా విస్తీర్ణంలో 18 రకాల విత్తనాలను పన్నెండు కిలోలు వేస్తే సుమారు 18 నుంచి 25 క్వింటాళ్ల బయోమాస్ లభిస్తుందని వివరించారు. దీని వల్ల నేల సారవంతంగా మారి చీడ పీడలు, ప్రకృతి వైపరీత్యాల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. బీజామృతం, ద్రవ జీవామృతం తయారీపైనా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

క్రిమినల్ కేసులు తక్షణమే ఎత్తివేయాలి



నినదిస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: 2025 మార్చి 21న కుప్పిలి ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన సంఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారి అనాలోచిత, ఏకపక్ష వైఖరితో అక్రమంగా సస్పెండైన 14 మంది ఉపాధ్యాయులపై ఉన్న పెండింగ్ ఛార్జీలను, క్రిమినల్ కేసులను తక్షణమే ఎత్తివేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక జిల్లా కమిటీ ముఖ్య ప్రతినిధులు మజ్జి మదన్ మోహన్, చౌదరి రవీంద్ర, తంగి మురళీమోహన్, దుప్పల శివరాంప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ నెల 28న డీఈఓపై విచారణ జరగనున్న నేపథ్యంలో శనివారం ఐక్యవేదిక నాయకులు కీలక సమావేశం నిర్వహించారు. సస్పెన్షన్స్ అభియోగాలపై వేసిన కమిటీలు విచారణ జరిపి ఎటువంటి తప్పిదాలు జరగలేదని నివేదికలు ఇచ్చి నెలలు గడుస్తున్నా నేటికీ డీఈఓ మొండి వైఖరి కారణంగా ఉపాధ్యాయులను వేధిస్తున్నారని మండిపడ్డారు. డీఈఓపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందేనని నినదించారు. కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకుని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఎస్.వి.రమణ, పప్పల రాజశేఖరరావు, పూజారి హరిప్రసన్న, శీర రమేష్‌బాబు, బోనెల రమేష్ పాల్గొన్నారు.

వెంకన్నకు విశేష పూజలు



దూదివారి కోవెలలో తులసిమాల అలంకరణ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిన్నబజారులో దూదివారి వేంకటేశ్వర ఆలయంలో శనివారం స్వామివారిని పూలమాలలతో అలంకరించారు. అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. మొండేటివీధిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు పట్నాల రామకృష్ణ, శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. అనంతరం సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు.

వీధి వ్యాపారులకు..
భరోసా ఏదీ?

- రుణ సాయం అందించని ప్రభుత్వం
- రోజువారి వడ్డీకి తీసుకుంటూ నష్టపోతున్న వైనం
- గత వైఎస్సార్ సీపీ హయాంలో వడ్డీ లేని రుణాలు



తోపుడుబండిపై పండ్లు విక్రయిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం వీధి వ్యాపారులను చిన్నచూపు చూస్తోంది. రెక్కాడితే గాని డొక్కాడని వీరికి ఎటువంటి సాయం అందించకుండా చోద్యం చూస్తోంది. ఆర్థికంగా చేయూతని ఇవ్వకపోగా ఉన్న వ్యాపారాలను ఆయా స్థలాల నుంచి తొలగిస్తూ ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రభుత్వం రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల దగ్గర రోజువారి వడ్డీపై రుణాలు తీసుకొని రోజంతా చెమటోడ్చి కష్టపడి సంపాదించినదంతా వడ్డీ వ్యాపారుల చేతుల్లో పోయాల్సివస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అప్పు తీసుకొని వ్యాపారాలు చేయాల్సి వచ్చినా కొంతమంది దయాదాక్షిన్యాలు లేకుండా వంద రూపాయలకు రోజుకు 8 నుంచి 10 రూపాయల వరకు వడ్డీ వసూలు చేస్తుండటంతో కుటుంబం గడవడం కష్టతరమవుతోంది.

ముద్ర రుణాలు ఎక్కడ?

వైఎస్ఆర్ సీపీ హయాంలో వడ్డీ లేని రుణాలు, ముద్ర లోన్ ఇవ్వడం వల్ల వీధి వ్యాపారులకు ఆసరా దొరికేది. రోజంతా కష్టపడి సంపాదించిన ఆదాయంతో కుటుంబం అంతా హాయిగా జీవించేవారు. ఇప్పుడు ఆ ధీమా లేకుండా పోయింది. వీధి వ్యాపారుల స్థితిగతులు తెలుసుకొని వారికి సహాయం అందించేలా చూడాల్సిన పట్టణ సామాజిక అభివృద్ధి విభాగం అధికారులు కనీసం పట్టించుకున్న దాఖలాలు ఉండటం లేదు.

ఆశీల భారం..

శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నగరంతో మేజర్ పంచాయతీలు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చి వ్యాపారాలు చేస్తూ ఉంటారు. ఇటువంటి వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోకపోగా ఆశీలు అంటూ పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేయిస్తూ చిరు వ్యాపారులు మరింత అవస్థలు పాలవుతున్నారు. వీధి వ్యాపారులకు ఒకే చోట వ్యాపార సముదాయాలను నిర్మించి వడ్డీ లేని రుణాలు అందిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీలు ఇచ్చినప్పటికీ అది అమలు కావడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని వీధి వ్యాపారులకు వడ్డీ లేని రుణం అందేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కూటమి నేతలవి మోసపూరిత హామీలు



శ్రీకాకుళం రూరల్: కనుగులవానిపేటలో బాబు మోసాలను వివరిస్తున్న నాయకులు

శ్రీకాకుళం రూరల్: సీఎం చంద్రబాబునాయుడు అబద్ధాల రాయుడని, కూటమి నాయకులు చెప్పిన వన్నీ మోసపూరిత హామీలేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దుయ్యబట్టారు. శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని కనుగులవానిపేట, కుందువానిపేట, పి.జి.పేట, వాకలవలస, నందగిరిపేట గ్రామాల్లో శనివారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి క్యూర్ స్కాన్ ద్వారా చంద్రబాబు మోసాలను వివరించారు. బాబు మాయమాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, నాయకులు అంబటి శ్రీనివాసరావు, మూకళ్ల తాతబాబు, బొడ్డేపల్లి రమేష్, దుంపల శ్యామలరావు, ఇప్పిలి బాబు, గంగు నరేంద్రకుమార్, ఎచ్చెర్ల శ్రీధర్, బగాది మనోజ్, సూరాడ సూర్యం, కె. అప్పలనాయుడు, చీకటి గురువులు, ఐ.వి.సత్యనారాయణ, బాణ రామకిషోర్, వారధి నారాయణరావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి కూటమి వైఫల్యాలు



శ్రీకాకుళం పీఎన్ కాలనీ: బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): ప్రజలకు అమలుకాని హామీలివ్వడం అమలుచేయకుండా వెన్నుపోటు పొడవడం చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, పార్టీ తూర్పుకాపు కుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం 19, 35, 37 డివిజన్లలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేస్తూ సూపర్ సిక్స్ పేరిట ప్రజలకు ఎలా మోసం చేశారో క్యూఆర్ కోడ్ ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, సాధు వైకుంఠరావు, కర్నేన హరిబాబు, పద్మావతి, రుప్ప శేషగిరి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎం.ఎ.బేగ్, కత్రి రంగాజి దేవ్, గుంటముక్కల పాపారావు, బైరి మురళీధర్, రమేష్ భరద్వాజ్, మహిబుల్లాఖాన్, కామేశ్వరి, మహేంద్ర, చందు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ కిచెన్ రూమ్ నిర్మాణానికి చర్యలు

బూర్జ: మండలంలోని కొల్లివలసలో గల డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకులంలో మోడల్ (డార్మెట్రి) కిచెన్ రూమ్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ డార్మెట్రి, వంటగదిని పరిశీలించి, విద్యార్థులు భోజనాలు చేసిన సమయంలో పడుతున్న సమస్యలను గుర్తించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ అధికారులతో కలిసి అసిస్టెంట్ కలెక్టర్ శనివారం గురుకులాన్ని పరిశీలించారు. శ్రీకాకుళం అక్షయ ఫౌండేషన్, హరే కృష్ణ వారి ఆర్థిక సహాయంతో మోడల్ డార్మెట్రి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులు తయారు చేసిన ప్రతిపాదిత అంచనాలతో త్వరగా వంటగది, విద్యార్థుల డార్మెట్రిని నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా గురుకులాల సంక్షేమ సమన్వయకర్త జి.గ్రేస్, సోషల్ వెల్ఫేర్ డీఈ కె.సురేష్, ఆమదాలవలస సర్వశిక్ష అభియాన్ ఏఈ సాయిరాం, గురుకులం ప్రిన్సిపాల్ బి.రాంబాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎ.లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

గౌరవ భృతి అందేనా?

- ఎంపీటీసీలకు ఏడాదిన్నరగా అందని భృతి
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం



గౌరవభృతి అందడం లేదంటూ నిరసన తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యులు(ఫైల్)

జి.సిగడాం : మండల స్థాయి తీర్మానాలు, సర్వసభ్య సమావేశాలకు తాము అవసరం గానీ తమకు న్యాయంగా దక్కాల్సిన గౌరవ భృతి చెందుకు చెల్లించడం లేదని పలువురు ఎంపీటీసీ సభ్యులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. జి.సిగడాం మండలంలో గత మూడు సర్వసభ్య సమావేశాల్లోనూ గౌరవ భృతి విషయమై ఉన్నతాధికారులను విన్నవించుకున్నా ఫలితం రాకపోవడంపై వారంతా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిసారీ సంతకాలు చేయిస్తున్నారు తప్ప గౌరవ వేతనం మాత్రం ఎంపీటీసీల ఖాతాలో జమ కావడం లేదని అంటున్నారు. గతంలో ఎంపీటీసీలంతా కలిసి గౌరవ భృతి విషయమై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు వినతిపత్రం అందించారు. అయినా ఫలితం లేకపోయిందని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించకపోతే సమావేశాలు, మండల తీర్మానాలకు దూరంగా ఉండాల్సి వస్తుందని స్పష్టం చేస్తున్నారు.

జమ చేయాలి..

ఎంపీటీసీలకు గౌరవ భృతి మంజూరు చేయాలి. కలెక్టర్ ఇచ్చిన హామీ కూడా అమలుకాకపోవడం బాధాకరం.

– కుమరాపు రమేష్‌నాయుడు, ఎంపీటీసీ సభ్యుడు, డీఆర్‌వలస

చిన్నచూపు తగదు..

ప్రభుత్వానికి మాతో పని లేనప్పుడు సమావేశాలు ఎందుకు? గౌరవ వేతనం మంజూరు చేస్తేనే సమావేశాలకు హాజరవుతాం.

– మీసాల సాధ్వీమణి, వైస్ ఎంపీపీ, నిద్దాం

గుర్తింపు లేదు..

కూటమి ప్రభుత్వం వచ్చాక మాకు గుర్తింపు లేకుండాపోతోంది. ఎవరూ పట్టించుకోవడం లేదు. కనీసం గౌరవ వేతనాలు ఇవ్వడం లేదు.

– గేదెల వరలక్ష్మి, ఎంపీటీసీ, టి.డి.వలస

గుర్తు తెలియని వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని బోడెమ్మకోవెల సమీప సారంగదల్ వీధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు ఒకటో పట్టణ ఎస్ఐ-2 జగన్నాథరావు పేర్కొన్నారు. ఇతను కొన్నేళ్లుగా వీధుల్లో భిక్షమెత్తుకుని జీవించేవాడు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం రాత్రి కాలువలో పడిపోయి మృతిచెందాడు. వీఆర్వో ఇచ్చిన రిపోర్టు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యాప్‌ల భారం తగ్గించకపోతే బహిష్కరణే



డీఈవో కార్యాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయులపై పని భారాన్ని తగ్గించి పాఠాల బోధనకు అవకాశం కల్పించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీరామమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెండు నెలలగా వేతనాలు రాక అవస్థలు పడుతున్న ఉపాధ్యాయులకు వెంటనే పొజిషన్ ఐడీలు క్రియేట్ చేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర సంఘం ఇచ్చిన పిలుపు మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట సంఘ కోశాధికారి బి.రవికుమార్ అధ్యక్షతన శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ బోధన కాకుండా యాప్‌లకు ప్రాధాన్యమిస్తూ పాఠశాల నిర్వీర్యానికి ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ఈ విధానాన్ని వెంటనే మార్చుకోకపోతే ఆగస్టు ఒకటి నుంచి అన్ని యాప్‌లను బహిష్కరిస్తామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. రెండు నెలలగా 65వేల మందికి జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం భావ్యం కాదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రతినిధులు సూర్యప్రకాశరావు, సురేష్, స్వర్ణకుమారి, చౌదరి రవీంద్ర, గొంటి గిరిధర్, పొందూరు అప్పారావు, ఎండ ఉమాశంకర్, బాబూరావు, ఉమా భాస్కర్, కోదండ రామయ్య, త్రినాథ్, శ్రీను, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నార్త్‌జోన్ క్రికెట్ జట్టుకు ఆరుగురు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏసీఏ నార్త్‌జోన్ అండర్-16 బాలుర క్రికెట్ జట్టుకు జిల్లా నుంచి రికార్డు స్థాయిలో ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో రాణించడంతో తుది జట్టులో అవకాశం లభించింది. ఎంపికైనవారిలో వి.ప్రణీత్, వి.క్రాంతి, ఎస్.వివేక్ ఆనంద్, పి.రిత్విక్ సాగర్, సీహెచ్ రోహిత్, జె.హర్షవర్ధన్ ఉన్నారు. వీరంతా త్వరలో జరగనున్న ఏసీఏ అంతర్‌జోనల్ అండర్-16 క్రికెట్ టోర్నీలో నార్త్‌జోన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు.

నేడు లయన్స్‌క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

శ్రీకాకుళం అర్బన్: లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం ఉదయం 10 గంటలకు శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులోగల బృందావనం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు క్లబ్ ప్రతినిధులు నటుకుల మోహన్, పొన్నాడ రవికుమార్ శనివారం తెలిపారు. విశ్రాంత డీజీపీ జె.పూర్ణచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. క్లబ్ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బూత్ స్థాయిలో బలోపేతం కావాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతీయ జనతా పార్టీ గ్రామాలు, బూత్‌స్థాయిలో బలోపేతం కావడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి విజయానంద్ అన్నారు. ఇటీవల నియామకమైన జిల్లా నూతన పదాధికారుల తొలి సమావేశం శనివారం శ్రీకాకుళం జిల్లా ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కోర్ కమిటీ సభ్యులు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, ఎస్.తేజేశ్వరరావు, పూడి తిరుపతిరావు, అట్టాడ రవిబాబ్జి, సెర్వాన ఉమామహేశ్వరి, బిర్లంగి ఉమామహేశ్వరరావు, చల్లా వెంకటేశ్వరరావు, సీహెచ్ దుర్గారావు గాంధీ, సలాన రాఘవ, నూతన జిల్లా ప్రధాన కార్యదర్శులు పేడాడ సూరపునాయుడు, చింతు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన టెక్కలి నూతన డీఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : సాధారణ బదిలీల్లో భాగంగా టెక్కలి నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన డి.లక్ష్మణరావు శనివారం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. టెక్కలి డివిజన్‌లో శాంతిభద్రతల పరిరక్షణ, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై పూర్తి దృష్టి పెట్టాలని ఎస్పీ డీఎస్పీకి సూచించారు.

గార పంచాయతీలో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



మోసగించడమే చంద్రబాబు నైజం



రణస్థలం: అర్జునవలసలో ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

గార: అబద్ధపు హామీలిచ్చి పదవిలోకి వచ్చాక మోసం చేయడమే సీఎం చంద్రబాబు పాలనని గార ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శనివారం గార పంచాయతీలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి క్యూఆర్ కోడ్ ద్వారా చంద్రబాబు ఇచ్చిన హామీల వివరాలను చూపించారు. ఏడాదిలో ఇవ్వాల్సిన రైతు భరోసా, అమ్మఒడి పేర్లు మార్చేసి మోసం చేశారని మండిపడ్డారు. చాలామంది తల్లులకు తల్లికి వందనం పథకం డబ్బులు జమ కాలేదన్నారు. ఆడబిడ్డ నిధి పేరిట ప్రతిమహిళకు రూ.1500 ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. ఇప్పుడు ఆ పథకాన్ని అమలు చేయాలంటే ఆంధ్రానే అమ్ముకోవాలనడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మార్పు దుర్గా పృథ్వీరాజ్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు ముంజేటి కృష్ణమూర్తి, అరవల రామకృష్ణ, పీస శ్రీహరిరావు, శిమ్మ ధర్మరాజు, బరాటం నాగరాజు, వమరవల్లి ఉదయ భాస్కరరావు, తెనుకోటి అప్పారావు, అంబటి చినబాబు, వజ్జ వెంకటప్పలనాయుడు, ఆరంగి రమణమూర్తి, మార్పు మన్మథరావు, పిట్ట రమణ, గుజ్జల అప్పలరాజు, దాసరి అప్పన్న, ఆరంగి శ్రీను, సద్గుణ, రాంబాబు, పుల్లటి మధు, ఫల్గుణ తదితరులు పాల్గొన్నారు.

శాలిహుండంలో...

అధికారం కోసం చంద్రబాబు అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేశాడని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి అన్నారు. శాలిహుండం పంచాయతీలో మండల పార్టీ అధ్యక్షుడు పీస గోవిందరాజులు అధ్యక్షతన బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు చేసిన మోసాలు క్యూఆర్ కోడ్ ద్వారా వివరించారు. పేదప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో న్యాయం జరిగితే..చంద్రబాబు పాలనలో పేదలకు అన్యాయం జరుగుతోందన్నారు. రైతులు, యువకులు, మహిళలు అన్ని వర్గాల ప్రజలు సంక్షేమానికి దూరమవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు అంధవరపు బాలకృష్ణమూర్తి, కొయ్యాన నాగభూషణం, గొండు జయరాం, పుల్లటి నాగేశ్వరరావు, యాళ్ల నారాయణమూర్తి, పొదిలాపు రామజోగి, జల్లు గౌరీపతినాయుడు, చింతల గడ్డెయ్య, బోర రమణ, బోర ఢిల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ఒరిగిందేమీలే..

రణస్థలం: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా ఇంటింటికి వంచన చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు గొర్లె శ్రీనివాసరావు అన్నారు. రణస్థలం మండలం దేవరాపల్లి, అర్జునవలస గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి చంద్రబాబు చేసిన మోసాలను వీడియో రూపంలో వివరించారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేకపోయినా ఆ పార్టీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు అంటూ ఇంటింటికి తిరగడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రామాల్లోకి కూటమి నాయకులు వస్తే చెప్పిన హామీలు, ఇస్తానన్న సంక్షేమ పథకాలు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించాలన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున ప్రజలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యం నాయుడు, ఎచ్చెర్ల నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు దన్నాన హరి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మహంతి అప్పలనాయుడు, టేకు బ్రహ్మాజీ, సర్పంచ్ గొర్లె రాధాకృష్ణ, సర్పంచ్ మీసాల శ్రీనివాసరావు, మీసాల రాము నాయుడు, నాయకులు రామిశెట్టి మహేష్, కొత్తకోట్ల ఆదినారాయణ, సిరిపురపు శ్రీరామ్, కొండపల్లి పెంటయ్య, మీసాల తవిటినాయుడు, కొత్తకోట ఉత్తర కుమార్, కొకట్ల భీముడు తదితరులు పాల్గొన్నారు.



గార: శాలిహుండంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంలో నాయకులు

భరతమాత ముద్దుబిడ్డలు మన సైనికులు



కార్గిల్‌వార్‌లో పాల్గొన్న మాజీ సైనికుడిని సత్కరిస్తున్న దృశ్యం



రణస్థలంలో కార్గిల్ దివాస్ ర్యాలీ

శ్రీకాకుళం న్యూకాలనీ: మన సైనికులు భరతమాత ముద్దుబిడ్డలుగా నిలుస్తారని పలువురు వక్తలు కొనియాడారు. కార్గిల్ విజయ్ దివాస్‌ను పురస్కరించుకుని మాజీ సైనికుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు, పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం: దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన కార్గిల్ వీరుల త్యాగాలను గుర్తుంచుకోవడం సమాజ బాధ్యతనిఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. రణస్థలంలో కార్గిల్ దివాస్ ర్యాలీ నిర్వహించారు.